క్లుప్తంగా

సేంద్రియ కూరగాయల స్టాల్ ప్రారంభం



అచ్యుతాపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల స్టాల్

అచ్యుతాపురం: సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయల స్టాల్‌ను సోమవారం అచ్యుతాపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రారంభించారు. ప్రతి సోమవారం ఈ స్టాల్ అందుబాటులో ఉంటుందని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఈ స్టాల్‌ను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణ, వెంకటరమణ, వరలక్ష్మి, తదితర సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం



సేంద్రియ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను విక్రయిస్తున్న మహిళలు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పప్పు దినుసులను వినియోగించాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ కోరారు. మునగపాక మండలం గణపర్తికి చెందిన పలువురు మహిళలు ఎటువంటి రసాయనిక ఎరువులను వినియోగించకుండా ఆర్గానిక్ పద్ధతులతో సాగు చేసి పండిన ఉత్పత్తులను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అమ్మకాలు చేస్తున్నారు. తాజా కూరగాయలతో పాటు బెల్లం, పప్పు దినుసులతో తయారు చేసిన పలు రకాల వంటకాలు, అలాగే బియ్యం, తదితర ఉత్పత్తులు ఈ స్టాల్‌లో అందుబాటులో ఉన్నాయి. తాజా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రతి సోమవారం విక్రయించనున్నట్టు స్టాల్ నిర్వాహకులు తెలిపారు. ప్రజలు కూడా మారుతున్న కాలంతో పాటు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రసాద్ సూచించారు.

దారుణ స్థితిలో పల్లె దారులు



జి.సన్యాసిరాజుపాలెంలో కోరుకుపోయిన రోడ్డు

కోటవురట్ల: పల్లె రహదారులు వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. ఏ ఊరికెళ్లినా దారుణ దారులే దిక్కవుతున్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం తప్పదు. ప్రధానంగా మలుపుల్లో రహదారులు అధ్వానంగా ఉండడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. జి.సన్యాసిరాజుపాలెం రహదారి చాలా వరకు ఛిద్రమైంది. పెద్ద గోతులు పడడంతో పాటు, మలుపుల్లో కోరుకుపోయి పిక్క తేలిపోయింది. వేగంగా వెళితే జారిపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న లఘు నాటికలు



గణిత శాస్త్రవేత్త రామానుజన్ జీవిత చరిత్రపై విద్యార్థులు ప్రదర్శిస్తున్న లఘు నాటిక

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూలు లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రపై విద్యార్థులు సోమవారం నిర్వహించిన లఘు నాటికలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. జాతీయ గణిత మాసోత్సవాల్లో భాగంగా ఈ నాటికతోపాటు గణితం నిజ జీవితంలో ఉపయోగపడే భావనలతో కూడిన నాటికను ప్రదర్శించారు. ఇవి ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా హెచ్ఎం జి.వి.కె ఆచారి మాట్లాడుతూ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర, గణిత భావనలపై విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు.

రోడ్లు ఘోరం.. ఒళ్లు హూనం.!

- గతుకుల రహదారులకు మోక్షమెన్నడో?
- వర్షాకాలంలో వెతలు వర్ణనాతీతం
- అధ్వానంగా గ్రామీణ మార్గాలు
- ప్రకటనలకే పరిమితమైన పాలకులు, అధికారులు



వర్షాలకు బురదమయమైన వాడ్రాపల్లి-తిమ్మరాజుపేట రోడ్డు

మునగపాక:

అధ్వాన రహదారులు గ్రామీణ ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. అడుగడుగునా గోతులతో ప్రయాణికుల ఒళ్లు హూనం అవుతోంది. వచ్చే ఏడాది జనవరి కల్లా గోతుల్లేని రహదారులే లక్ష్యం అన్న కూటమి నేతల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. మునగపాక మండలంలోని పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల రహదారులు గోతులమయం కావడం.. మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామంటూ పాలకులు చెప్పుకుంటున్నా క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో ప్రయాణం మరీ నరకంగా ఉంటుందంటూ పలువురు వాపోతున్నారు. గుంతలు లేని రహదారుల ఏర్పాటే లక్ష్యం అంటూ ప్రకటనలే తప్ప అమలుకు నోచుకోవడం లేదు.



గోతులమయమైన నాగవరం రోడ్డు

- రాజుపేట, పాత నాగవరం నుంచి పరవాడకు వెళ్లే కొత్త నాగవరం రోడ్డు పలు చోట్ల గోతులమయంగా ఉంది. గోతులను తప్పించే క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. వర్షా కాలంలో గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. నిత్యం ఈ మార్గంలో అటు పరవాడకు ఇటు మండల కేంద్రానికి రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు.
- వాడ్రాపల్లి నుంచి తిమ్మరాజుపేట వరకు విశాఖ డెయిరీ ద్వారా రైతుల నుంచి భూమి సేకరించారు. ఈ మార్గంలో గ్రావెల్ రహదారి నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు పక్కా రోడ్డుకు నోచుకోలేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసే రోజుల్లో వారి బాధలు వర్ణనాతీతం.
- తోటాడ నుంచి వయా నారాయుడుపాలెం, చిన్నోడుపాలెం మీదుగా రాజుపేట నుంచి నాగవరానికి వెళ్లేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. పాటిపల్లి కొండపై గ్రావెల్ తవ్వకాలు చేపట్టి వాహనాలు రాజుపేట నుంచి వెళ్తుండేవి. దీంతో ఈ రోడ్డు అంతా ఛిద్రంగా మారింది. అడుగడుగునా రోడ్డు పాడైపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.
- మునగపాక మండలం గణపర్తి నుంచి కశింకోట మండలం జోగారావు పేట వరకు ఉన్న రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు వర్షం వస్తే బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి గత అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి పక్కా రోడ్డు నిర్మాణానికి ముందుకొచ్చారు. అయితే ఎన్నికలు సమీపించే వేళ కావడంతో పనులు చేపట్టలేకపోయారు.



ఇటీవల వర్షాలకు అధ్వానంగా తయారైన గణపర్తి-జోగారావుపేట రోడ్డు

- మునగపాక మండలం నాగులాపల్లి నుంచి తోటాడకు వెళ్లేందుకు విశాఖ డెయిరీ రైతుల నుంచి భూమి సేకరించి గ్రావెల్‌తో రహదారి సదుపాయం కల్పించారు. అయితే ఈ రోడ్డు కూడా దెబ్బతినడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

గ్రావెల్ రోడ్డే దిక్కు..



చూచుకొండ నుంచి గణపర్తి మీదుగా గంటవానిపాలెం వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నాం. గ్రావెల్ రోడ్డుపై వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా తయారవుతోంది. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పక్కారోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– కాండ్రేగుల కిరణ్‌కుమార్, ద్విచక్ర వాహనదారుడు, చూచుకొండ

చెరువును తలపిస్తున్న గోతులు



తిమ్మరాజుపేట నుంచి వాడ్రాపల్లి వరకు గతంలో విశాఖ డెయిరీ ద్వారా గ్రావెల్ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఈ రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీనికి తోడు వర్షం పడితే గోతుల్లో నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్నాయి. తక్షణం రహదారి మెరుగునకు నిధులు మంజూరు చేయాలి.

– కాండ్రేగుల జగన్, ఉప సర్పంచ్, తిమ్మరాజుపేట

ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు

గ్రామీణ రహదారులను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం చేపడుతుంది. రహదారుల పరిస్థితులపై ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసి పంపాం. నిధులు మంజూరు కాగానే రహదారుల అభివృద్ధిపై దృష్టి పెడతాం. రహదారుల్లో గోతులు పూడ్చివేతకు చర్యలు తీసుకుంటాం.

– పద్మిని, ఆర్అండ్‌బీ జేఈ

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు



డీటీ శేషుబాబుకు వినతిపత్రం అందిస్తున్న నారాయుడుపాలెం గ్రామస్తులు

మునగపాక: ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతూ మండలంలోని నారాయుడుపాలెం గ్రామస్తులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో రెండెకరాల మేర ప్రభుత్వ భూమి ఉందని, దీనికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దర్జాగా ఆక్రమించి పశువుల పాక నిర్మించుకున్నా ఇంతవరకు అధికారులు పట్టించుకోలేదన్నారు. దీనికి తోడు ఇటీవల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదన్నారు. ఉన్నతాధికారులతో విచారణ చేపట్టి ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీటీ శేషుబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సబ్బి శ్రీనివాసరావు, కోరుకొండ రాజు, కేఎస్‌వీ రావు, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

పూడిమడకలో రహదారుల పరిశీలన

అచ్యుతాపురం: ఫిషింగ్ హార్బర్‌కు అనుకూలంగా ఉండే రహదారుల గురించి మత్స్యశాఖ అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం అచ్యుతాపురం మండలంలోని పూడిమడక పరిధిలోని ఫిషింగ్ హార్బర్‌కు సంబంధించి నిర్మాణంలో ఉన్న, అనుకూలంగా మిగిలిన రహదారులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు



జల్లూరులో వరి కోతలు చేస్తున్న కూలీలు

కోటవురట్ల: మండలంలో ఖరీఫ్ వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఫెంగల్ తుపాను కారణంగా ఇప్పటికే కోతలు బాగా ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో ముమ్మరంగా వరి కోతలు చేపడుతున్నారు. ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ సీజనులో సుమారు 4 వేల ఎకరాలలో వరి సాగు జరిగింది. వాతావరణం బాగుండడంతో పంట ఏపుగా పెరిగి కోత దశకు చేరుకుంది. వాస్తవానికి వారం రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభించాల్సి ఉండగా తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు కోతలను వాయిదా వేశారు. గింజ రాలిపోయే పరిస్థితికి చేరుకోవడంతో ప్రస్తుతం కోతలు జోరుగా చేస్తున్నారు. జల్లూరు, అన్నవరం, యండపల్లి, తంగేడు, లింగాపురం, కోటవురట్ల, రాజుపేట, చౌడువాడ, గొట్టివాడ, రామచంద్రపురం, పందూరు, కె.వెంకటాపురం, పాములవాక, చినబొడ్డేపల్లి, పి.కె.పల్లి నీలిగుంట, బి.కె.పల్లి ప్రాంతాలలో ముమ్మరంగా వరి కోతలు జరుగుతున్నాయి. దాంతో కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడింది.

చెడు వ్యసనాల జోలికి పోవద్దు



జల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్

కోటవురట్ల: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రమేష్ సూచించారు. జల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో సంకల్పం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికిపోవద్దన్నారు. చెడు స్నేహాలతో వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశలో క్రమ శిక్షణతోనే మంచి నడవడిక వస్తుందన్నారు. చదువుపై దృష్టి సారించి లక్ష్యాలను చేరుకోవడం ద్వారా ఉత్తమ జీవితం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల అర్జీలకు త్వరితగతిన పరిష్కారం



ఉద్దండపురంలో తహసీల్దార్ నర్సింహమూర్తికి అర్జీ అందిస్తున్న రైతు



ఈదటం గ్రామంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

నక్కపల్లి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపుతామని తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. సోమవారం ఉద్దండపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పట్టాదారు పాసు పుస్తకాలు, వెబ్ ల్యాండ్‌లు, మ్యూటేషన్ వంటి సమస్యలపై అర్జీలు అందజేశారు. నెలలు తరబడి తిరుగుతున్నా ఏదో సాంకేతిక ఇబ్బందులతో తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని రైతులు ఏకరువు పెట్టారు. వాటిని పరిశీలించి తమకు పాస్ పుస్తకాలు జారీ చేయాలన్నారు. సర్వే, సరిహద్దు సమస్యలపై కూడా అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి రైతులకు సమాచారం ఇచ్చామన్నారు. సమగ్రంగా విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, డీటీ అన్నాజీరావు, ఆర్ఐ కన్నాబాబు, స్థానిక నాయకుడు పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వరమే పరిష్కారం

పాయకరావుపేట: భూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ జి.సత్యనారాయణ అన్నారు. సోమవారం ఈదటం గ్రామంలో రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామంలో రైతుల నుంచి 27 దరఖాస్తులు అందాయని, వాటి పరిష్కరం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ త్రినాథ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తురంగలపాలెంలో 29 అర్జీలు

యలమంచిలి రూరల్: తురంగలపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 29 అర్జీలు స్వీకరించినట్టు డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్ తెలిపారు. అర్జీల్లో మ్యుటేషన్లకు సంబంధించినవే అధికంగా ఉన్నాయన్నారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ వరహాలు సూచించారు.

మునగపాక: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని చెర్లోపాలెం, నరేంద్రపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు.

అందుబాటులో మినుము విత్తనాలు

మునగపాక: మునగపాక రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవసరమైన మినుము విత్తనాలను అందుబాటులో ఉంచామని వీఏఏ సింధూజ ఒక ప్రకటనలో తెలిపారు. సీజన్‌లో రైతుల అవసరార్థం విత్తనాలు ఉన్నాయన్నారు. వీబీఎన్-8 రకం విత్తనాలు 4 కిలోలకు రూ.392 చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్‌కార్డుతో ఆర్‌బీకేకు రావాలని ఆమె కోరారు.

ఘనంగా నీలకంఠేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని వెంకటాపురంలో కొలువైన స్వయంభూ నీలకంఠేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో వెంకటాపురం పాల సంఘం అధ్యక్షుడు సుందరపు వెంకట కాసులుబాబు సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వీరునాయుడు, మాజీ సర్పంచ్ కనకప్పారావు, పెద్దలు కరణం రామకృష్ణ, పందూరి కనకప్పారావు, తదితరులు నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక



స్వప్నం రాల్చిన అమృతం నాటికలో ఓ సన్నివేశం

మునగపాక: స్థానిక నందీశ్వర తులసీ కళా వేదికపై ఆదివారం రాత్రి ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం'నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. మునగపాకకు చెందిన నాటకరంగ దర్శకుడు, దివంగత మొతిగా సాంబశివరావు సంస్మరణ కార్యక్రమంలో భాగంగా ఈ నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఒక కాకికి దెబ్బ తగిలి కింద పడిపోతే అన్ని కాకులు చుట్టూ చేరి కావు.. కావు అంటూ అరుస్తాయి. వాటి మధ్య ఏ బంధాలు, సంబంధాలు లేకపోయినా సరే సాటి కాకులుగా గొప్ప సానుభూతిని చూపిస్తాయి. అదే భార్యాభర్తల బంధానికి, అనుబంధానికి విలువనిచ్చే మనుషులం, ఆ కాకుల్లో ఉన్న కనీస జ్ఞానం మనలో లేకపోతే ఎలా అని తెలియజెప్పేదే స్వప్నం రాల్చిన అమృతం నాటిక ఇతివృత్తాంతం. కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ఆర్ట్స్ కళాకారులు ఈ ప్రదర్శన నిర్వహించారు. నాటికకు మూలకథ పీఎస్ నారాయణ అందించగా.. పరమాత్ముని శివరాం రచన చేశారు. రమేష్ మంచాల దర్శకత్వం వహించారు. ఈ నాటిక ప్రదర్శన తిలకించేందుకు కళాభిమానులు భారీగా తరలివచ్చారు. నందీశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలు విజయవంతం చేయాలి



మహాసభలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, తదితరులు

రాంబిల్లి(యలమంచిలి): ఈ నెల 13, 14న యలమంచిలిలో జరిగే ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు కోరారు. రాంబిల్లి మండల కేంద్రంలో సోమవారం ఎస్ఎఫ్ఐ మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నామన్నారు. రాంబిల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్, రాజేష్, తరుణ్, శీను, గోపి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డిపో డీలర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రెవెన్యూ డీటీ జి.ఆనంద్ తెలిపారు. నామవరం గ్రామంలో రెండు డిపోలకు, గుంటపల్లి, అంకంపేట, పాయకరావుపేట, శ్రీరాంపురం, సత్యవరం గ్రామాల్లో రేషన్ డీలర్ల నియమాకానికి ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26న డీలర్లకు పరీక్ష, 27న ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన అభ్యర్థులను ప్రకటిస్తామని డీటీ తెలిపారు.

బీమాతో బాధిత కుటుంబానికి భరోసా



బీమా చెక్కు అందిస్తున్న మేనేజర్ సత్యనారాయణ

తుమ్మపాల: ప్రతి ఒక్కరూ బీమా కలిగి ఉండాలని, తద్వారా కుటుంబానికి భరోసా కలుగుతుందని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. పట్టణంలో ఇండియన్ బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకం ద్వారా రూ.2 లక్షల చెక్కును కాపుశెట్టివానిపాలెం గ్రామానికి చెందిన కొసిరెడ్డి లక్ష్మి కుటుంబ సభ్యులకు సోమవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకంలో ఏటా రూ.436 బీమా ప్రీమియం చెల్లించడం ద్వారా సాధారణ మరణానికి రూ.2 లక్షలు పొందుతారన్నారు. 18 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ కేంద్ర బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనలో ఏడాదికి రూ.20 ప్రీమియం ద్వారా ప్రమాద బీమా రూ.2 లక్షలు పొందవచ్చన్నారు. రూపే ఏటీఎం కార్డు పొంది ఉంటే రూ.1 లక్ష ప్రమాద బీమా వస్తుందన్నారు.

నేడు కన్యకాపరమేశ్వరి వెండి రథం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కన్యకాపరమేశ్వరి వెండి రథం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులో కన్యకాపరమేశ్వరి ప్రతిష్టా శతజయంతి ఉత్సవాలలో భాగంగా రూ.1.10 కోట్లతో తయారు చేసిన వెండి రథాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు టి.జి.వెంకటేష్ మంగళవారం ప్రారంభించనున్నట్లు ఆలయ వెండి రథం ప్రాజెక్టు చైర్మన్ అగ్రెపు కామేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభం అనంతరం పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు.